క్లుప్తంగా

కొత్త పోస్ట్‌మాస్టర్‌కు సత్కారం

అగనంపూడి: అగనంపూడి సబ్‌పోస్టాఫీస్ పోస్ట్ మాస్టర్‌గా పి.ఎస్.వి.భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన పి.రామలింగేశ్వర రావు పదవీవిరమణ పొందడంతో భాస్కర్‌ను నియమించారు. కొత్త పోస్ట్‌మాస్టర్ భాస్కర్‌ను అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు కె.అప్పారావు, బి.సత్యనారాయణ, బి.ఈశ్వరరావు, ఎస్.సింహాచలం, బొడ్డేపల్లి కల్యాణి తదితరులు సత్కరించారు. అగనంపూడి పోస్టాఫీస్‌కు కేటాయించిన పిన్‌కోడ్ నంబర్ వెంటనే అమలులోకి వచ్చేలా కృషి చేయాలని వారు కోరారు.

'ఈసీహెచ్‌ఎస్ కార్డులు మార్చుకోవాలి'


మాట్లాడుతున్న మాజీ సైనికోద్యోగులు

అగనంపూడి: మాజీ సైనికోద్యోగులు తమ పాత ఈసీహెచ్‌ఎస్ కార్డులను మార్చుకోవాలని మాజీ సైనికోద్యోగుల సంఘ ప్రతినిధులు కోరారు. గతేడాది డిసెంబర్ మాసాంతంతో 16 కేబీ, 32 కేబీ ఈసీహెచ్‌ఎస్ కార్డుల గడువు ముగిసిన నేపథ్యంలో పాత కార్డుల స్థానంలో 64కేబీ కార్డులను మార్చుకోడానికి వీలు కల్పించారని తెలిపారు. త్రివిధ దళాలకు చెందిన మాజీ సైనికులు, వితంతువులు, సైనికోద్యోగుల ఆధారిత కుటుంబ సభ్యులు పాత కార్డులను తక్షణం మార్చుకోవాలని కోరారు. మాజీ సైనికోద్యోగుల ఆధారిత కుటుంబ సభ్యుల్లో 18 సంవత్సరాలు నిండిన వారు ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని తెలియజేశారు.

దినపత్రికలతో విజ్ఞానం


పత్రికల్లో అంశాలపై చర్చిస్తున్న చంద్రకళ

గాజువాక : గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులతో దినపత్రికల పఠనం (పేపర్ రీడింగ్) చేయించారు. అనంతరం పేపరులో ముఖ్య అంశాలపై గ్రంథాలయాధికారి బి.చంద్రకళ చిన్నారులతో చర్చించారు. ప్రపంచంలో జరిగే సంఘటనలతో పాటు వింతలు, విశేషాలన్నీ దినపత్రిక చదవడం ద్వారా తెలుస్తుందన్నారు. ప్రతీ రోజూ పేపర్ చదవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటే కార్యక్రమం పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీలో వేప, రావి, ఉసిరి, నేరేడు, కొబ్బరి, మామిడి, తదితర ప్రాణవాయువుని అధికంగా అందించే మొక్కలను నాటనున్నారు. వర్సిటీలోని ప్రధాన రహదారుల వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.శశిభూషణరావు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఎంప్లాయిమెంట్ బ్యూరో చీఫ్ ఆచార్య పి.అర్జున్, పరిశోధకులు మోహన్‌బాబు, శ్రీకాంత్, వినోద్ మాత్యూస్, రాజ్‌కుమార్, కల్యాణ్, అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల పాలనలో 40 ఏళ్ల అభివృద్ధి


ర్యాలీ అగ్రభాగంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి

- ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదే ఈ ఘనత
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ఉత్సాహంగా వైఎస్సార్‌సీపీ మహా ర్యాలీ


ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

గాజువాక : నాలుగేళ్ల పాలనలో 40 ఏళ్ల అభివృద్ధిని చూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా గాజువాక వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం నిర్వహించిన మహార్యాలీని బీసీ రోడ్ టీఎన్నార్ ఫంక్షన్ హాల్ వద్ద ఆయన ప్రారంభించారు. వందలాది బైకులు, కార్లతో బీసీ రోడ్‌లో ప్రారంభమైన ర్యాలీ కొత్తగాజువాక జంక్షన్, మెయిన్ రోడ్, సినిమా హాల్ జంక్షన్, పాతగాజువాక, ఆటోనగర్, బీహెచ్‌పీవీ వరకు సాగింది. అక్కడి నుంచి తిరిగి అదే మార్గంలో బీసీ రోడ్ వరకు ర్యాలీ కొనసాగింది.

దిగ్విజయంగా పాలన

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన దిగ్విజయంగా సాగుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రశంసలందుకుంటున్నారన్నారు. సంక్షేమ పాలనను చూసి ఓర్వలేని చంద్రబాబు తన అనుకూల మీడియాతో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుతంత్రాలు, కుయుక్తులు పన్నినా చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. చంద్రబాబుకు, అతని కనుసన్నల్లో నడుస్తున్న పవన్ కల్యాణ్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రజలు చుక్కలు చూపించడం ఖాయమన్నారు. పథకాల అమలు ద్వారా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలు హృదయాలను గెలుచుకున్నారని, ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి తన తండ్రికంటే రెట్టింపు పథకాలతో జన హృదయనేతగా ప్రజల గుండెల్లో నిలిచారని అన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, భూపతిరాజు సుజాత, ఉరుకూటి చందు, గుడివాడ సాయి అనూష, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పూర్ణానందశర్మ, బోగాది సన్ని, యువశ్రీ, పాల్గొన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిలు, అనుబంధ సంఘాల నాయకులు మార్టుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, వై.మస్తానప్ప, కొయ్య భారతి, రెడ్డి జగన్నాథం, ధర్మాల శ్రీను, గుడివాడ లతీష్, మాటూరి శ్రీనివాసరావు, మంత్రి శంకరనారాయణ, కోమటి శ్రీను, గొందేశి శ్రీనివాసరెడ్డి, మద్దాల అప్పారావు, పిట్టా రెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, నేలపాటి సత్యవతి, రోజారాణి, బొడ్డ గోవింద్, మహాలక్ష్మినాయుడు, దానప్పలు, కంది పైడినాయుడు, సంపంగి ఈశ్వరరావు, చిత్రాడ వెంకటరమణ, సక్క రమణబాబు, శ్రీను, చిన అప్పారావు, తోకాడ అప్పారావు తదితరులు హాజరయ్యారు.

వేతన ఒప్పందంపై సమావేశం ఏర్పాటు చేయాలి


స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం సంజీవరావుతో చర్చిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతన ఒప్పందంపై యాజమాన్యంతో సత్వరం సమావేశం ఏర్పాటు చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావును యూనియన్ నాయకులు శుక్రవారం కలిసి, చర్చలు జరిపారు. మే 16న జరిగిన ఉక్కు అడ్మిన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో హెచ్‌ఆర్ అధికారులు నెలలోగా ఉన్నత యాజమాన్యంతో వేతన ఒప్పందం గురించి సమావేశం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. వేతన ఒప్పందం జాప్యం వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని నాయకులు జీఎంకు తెలియజేశారు. సత్వరం వేతన ఒప్పందం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారని, సాధ్యమైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, శ్రీనివాసరావు, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం


ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

అక్కిరెడ్డిపాలెం: ఫ్రై డేను డ్రై డేగా పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం సూచించారు. 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారంలో ఒకరోజు డ్రై డే పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో టైర్లు, కొబ్బరి బొండాలు తొలగించాలని సూచించారు. రుబ్బురోళ్లు, పూలకుండీలు, ఇంట్లో ఫ్రిజ్ వెనుక ఉన్న ట్రేలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ మాట్లాడుతూ చెత్తను ఎప్పటికప్పుడు ఇంటికి వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేసి, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో నరేష్ కుమార్, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ రామారావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, మలేరియా అసిస్టెంట్ కొత్తర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం భావి తరాలకు మార్గదర్శకం


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా మారుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 841వ రోజు శుక్రవారం సంస్థకు చెందిన డబ్ల్యూఎండీ, యుటిలిటీ, ఏడీఎం, టీపీ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. వేలమందికి ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పండిత సదస్యం

అల్లిపురం: ఇసుకు కొండపై వేంచేసిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. దీంట్లో భాగంగా వేద బుత్విక్కులచే చతుర్వేదాల పారాయణం భాగంగా వేద మంత్రాలు శ్రావ్యంగా పఠనం చేయడంతో భక్తులు భక్తి పరవశులయ్యారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు పీవీ నరసింహమూర్తి జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీషను వేదాశీర్వచనంతో దీవించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో బుద్ధ మహాలక్ష్మి, నగేష్ పాల్గొన్నారు.

మహోజ్వల పోరాట ఫలితమే తెలంగాణ


వేడుకల్లో పాల్గొన్న ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంఘం నాయకులు

ఉక్కునగరం: వీరుల మహోజ్వల పోరాట ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన అని ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమం సంఘం పేర్కొంది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఉక్కునగరంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. సంఘం అధ్యక్షుడు ఎస్. కుమారస్వామి కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉక్కునగరంలో ఏటా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి జి. ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ బంగారు తెలంగాణగా మారేందుకు అందరూ సహకరించాలన్నారు. వేడుకల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్. వీరేశం, ఎం.కె.వి. మోహన్‌రావు, వేణుగోపాల్, అధికారుల సంఘం ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఆర్. నరసింహ, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్షణమే దహన ఖర్చులు చెల్లించండి

అల్లిపురం: జీవీఎంసీ రెగ్యులర్ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు తక్షణమే దహన ఖర్చుల నిమిత్తం రూ.25లు చెల్లించేలా జీవీఎంసీ కమిషనర్ సీహెచ్ సాయికాంత్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ రామారావు, ప్రధాన కార్యదర్శి నరసింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఉద్యోగి చనిపోయి సంవత్సరం గడిచిపోయినా దహన ఖర్చులు అందక వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారన్నారు.

ఈ విషయాన్ని కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి యూనియన్ నాయకులు తీసుకురావటంతో, తక్షణమే స్పందించిన ఆయన హెచ్‌వోడీలకు లక్ష రూపాయలు చొప్పున అడ్వాన్స్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారన్నారు.

జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించాలి

మురళీనగర్(విశాఖ ఉత్తర): హయ్యర్ వేజ్ పింఛన్ కోసం సభ్యులు, పెన్షనర్లు జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించుకోవాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్–2 పవన్‌కుమార్ జాస్తి ఒక ప్రకటనలో తెలిపారు.

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈపీఎఫ్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ నుంచి వచ్చిన సర్క్యులర్‌ను అనుసరించి ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ 1995 సంబంధించిన పింఛన్‌దారులు అధిక పింఛన్ కోసం యాజమాన్యంతో కలిపి జాయింట్ ఆప్షన్ ఫారాలను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపించాల్సి ఉంటుందన్నారు. https://unifiedportal-mem.epfindia.gov.in వెబ్‌సైట్‌లో ఫారాలు పంపించుకోవాల్సి ఉంటుందన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఎంప్లాయిమెంటు అధికారులు, సంస్థ ప్రతినిధులు

కంచరపాలెం : జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు కె.సుధ(టెక్నికల్), సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్)లు తెలిపారు. హోబిల్ బిలోస్ ఎంఎస్ఎన్ లేబరేటరీస్ హైదరాబాద్, హెటిరో, దక్కన్ ఫైన్ కెమికల్స్ తుని, మెడ్ ప్లస్ ఫార్మా విశాఖ, అనకాపల్లి, తమ్మినా సాఫ్ట్‌వైర్ సొల్యూషన్, టీజేఎల్ ఎన్‌డీటీ టెక్నాలజీస్‌తో పాటు పలు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 560 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 1,013 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 305 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, కె.సుధా చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్ర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రథయాత్ర మహోత్సవాల ఏర్పాట్లు, క్యూలైన్లు, మెడికల్, మంచినీటి సదుపాయం తదితర సదుపాయాల ఏర్పాట్లపై ఎమ్మెల్యేకి ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు వివరించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 19 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యేకి తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తాను కూడా సహకరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రభుప్రసాద్, 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఐఎస్‌డీటీ జర్నల్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) విశాఖ ప్రాంతీయ కేంద్రం నూతనంగా ప్రారంభించిన ప్రత్యేక సంచిక ప్రగ్యను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సంచికలో వివిధ ఆర్టికల్స్, ఇంటర్వ్యూలు, పుస్తక సమీక్షలు ప్రచురిస్తారు. అదే విధంగా పరిశ్రమల్లో నూతన విధానాలను దీనిలో చర్చిస్తారు. తొలి సంచికను వీసీ ప్రసాదరెడ్డికి విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ డాక్టర్ ఒ.ఆర్.ఎం.రావు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీడీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌కు సైతం ప్రత్యేక సంచికను బహూకరించారు. విశాఖ ఐఎస్‌టీడీలో 600 మందికిపైగా సభ్యులు ఉన్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

- వాహనచోదకుల అవస్థలు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని ఐలా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు


రోడ్డుపైనే ట్యాంకర్, మరో పక్క లారీ



రాంనగర్ రోడ్డుపై పార్క్ చేసిన భారీ వాహనం

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం రాంనగర్ ఏ–బ్లాక్‌లో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్‌తో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోజుల తరబడి భారీ వాహనాలు రోడ్డుపైనే ఉంటున్నా ఐలా సిబ్బంది గానీ, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గొడౌన్లకు వచ్చే భారీ వాహనాలతో అవస్థలు

రాంనగర్ ఏ – బ్లాక్‌లో భారీ గొడౌన్లు ఉన్నాయి. ఈ గొడౌన్లకు పలు రాష్ట్రాలు, జిల్లాల నుంచి ఆహార, గార్మెంట్స్, ఉడ్, పేపర్ వంటి ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులు జరుగుతుంటాయి. ఈ ఉత్పత్తులను దిగుమతి చేసుకునే సమయంలో కొన్ని రోజుల పాటు భారీ వాహనాలు రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు. దీంతో మిండి రాంనగర్ రోడ్డు నుంచి జింక్ గేటు మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. పలు మార్లు ప్రమాదాలకు గురవుతున్నారు.

వే బ్రిడ్జితో ఇబ్బందులు

ఏ – బ్లాక్‌లో ఎక్కువగా స్క్రాప్ వ్యాపారాలు సాగుతుంటాయి. ఇనుము, తుక్కుతో వచ్చే వాహనాలు వే బ్రిడ్జికి వస్తుంటాయి. వే బ్రిడ్జి వద్ద బరువు తీసుకునే సమయంలో వాహనాలు రోడ్డుపైనే గంటల కొద్దీ ఉండిపోతున్నాయి. ఈ సమయంలో వాహనచోదకులకు అవస్థలు తప్పడం లేదు.

భారీ వాహనాల పార్కింగ్

మిండి గ్రామానికి దగ్గరి మార్గంగా ఉన్న రాంనగర్ నుంచి మిండి రోడ్డులో భారీ వాహనాల పార్కింగ్ సమస్యగా మారుతోంది. రోజుల తరబడి వాహనాలు రోడ్డు పక్కగా పార్క్ చేసి ఉండటంతో గ్రామానికి చెందిన మహిళలు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో చీకటిగా ఉండటంతో మరీ ఇబ్బందికరంగా మారుతోంది. దీంతో పాటు భెల్ సిగ్నల్ పాయింట్ నుంచి రాంనగర్ రోడ్డులో జన సంచారం ఎక్కువగా ఉండటంతో వాహనాల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

ఏ–బ్లాక్‌లో ట్రాఫిక్ సమస్యపై ఐలా అధికారులు గానీ, ట్రాఫిక్ పోలీసులు గానీ దృష్టి సారించడం లేదని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారు దృష్టి సారించి, ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఒకసారి యాక్సిడెంట్ అయింది

జింక్ గేటు నుంచి రాంనగర్‌కు ఉదయం సమయంలో వస్తుండగా రోడ్డు పక్కన పార్క్ చేసిన భారీ వాహనం మలుపు తిరుగుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాను. అదృష్టవశాత్తు గాయాలతో బయటపడ్డాను. రోడ్డుపైనే భారీ వాహనాలు నిలిపి ఉంచడం ప్రమాదకరం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జయరాం, వాహనచోదకుడు, ఎస్‌ఏడీ

రోజూ ఇబ్బందే..

రాం నగర్ నుంచి జింక్ గేటుకు వెళ్లే మార్గం నుంచే రోజూ విధులకు వెళ్తాను. ఆ రోడ్డులో వాహనాల పార్కింగ్ సమస్యగా ఉంటోంది. వాహనం వద్దకు వచ్చేసరికి వాహనం ఒక్కసారిగా కదిలేసరికి తికమకగా ఉంటుంది. దీంతో ఆందోళకు గురవుతున్నాం. రోడ్డుపై వాహనాలు ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– విష్ణు, వాహన చోదకుడు, నరవ

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు


ఫుడ్‌కోర్టు ప్రాంతంలో చెత్తాచెదారాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జోన్–4 పరిధి సెంట్రల్ పార్క్, రామ్‌నగర్, గవర్నర్ బంగ్లా, జిల్లా పరిషత్ జంక్షన్, మహారాణిపేట, ద్రోణంరాజు సర్కిల్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రాత్రి పారిశుధ్య పనులు సరిగ్గా నిర్వహించడం లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్‌కోర్ట్ ప్రాంతంలో శానిటేషన్ పరిశీలించి బడ్డీల కింద ఉన్న వ్యర్థాలను తొలగించడం లేదని, దుకాణదారులు ఎవరి దుకాణం కింద ఉన్న చెత్తను వారే తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో మూత్ర విసర్జనతో పాటు తినుబండారాల వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడవేస్తున్నారని వాకర్స్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా, మూత్ర విసర్జన చేయకుండా నిరోధించాలని, ఈ ప్రాంతంలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మహారాణిపేట భారతి హాస్పటల్ వద్ద చెత్త అధికంగా ఉందని, వెంటనే శుభ్రం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశిస్తూ, ఇకపై వ్యర్థాలు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ద్రోణంరాజు సర్కిల్ అభివృద్ధిపై పర్యవేక్షక ఇంజినీరు వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ దిలీప్‌తో చర్చించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.